ప్రజాశక్తి
గురువారం 26 సెప్టెంబర్ 2024 5
శ్రీ సత్యసాయి





ఆర్‌కె నర్సింగ్ హోం వైద్యురాలితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారిణి మంజువాణి

అనంత వైపరీత్యం..!



వర్షాలు రావడంలో రాష్ట్రమంతా ఒక ఎత్తైతే అనంతపురం జిల్లా ఒక ఎత్తు అన్నట్టుగా ఉంది. వర్షాలు అంతటా వస్తే ఇక్కడ మాత్రం సెప్టంబర్‌లో వర్షాభావం నెలకొంది. అది కూడా ఒక నెల బాగా వస్తే మరో నెల తీవ్ర వర్షాభావం నెలకొంది. రెండేళ్లలో కురిసిన వర్షపాతం చూస్తే గతేడాది జూన్, ఆగస్టు నెలల్లో వర్షాభావం నెలకొంటే... ఈ ఏడాది జులై, సెప్టంబర్ మాసాల్లో వర్షాభావం నెలకొంది. ఈ ఏడాది మంచి వర్షాలు పడినట్టుగా కనిపిస్తున్నా, పంటలకు కీలకమై జులై, సెప్టంబర్ మాసాల్లో వర్షాభావం నెలకొంది. ఈ ప్రభావం పంటల సాగుపైనే కాకుండా వేసిన పంటలపైనా పడుతుండటం గమనార్హం.

◆ గతేడాది జూన్, ఆగస్టు ఈ ఏడాది జులై, సెప్టెంబర్...
◆ ఆగస్టులో దంచికొట్టింది... సెప్టెంబర్‌లో వర్షాభావం

	సాధారణం	నమోదు	శాతం	సాధారణం	నమోదు	
జూన్	61	45.8	-24.9	61.0	147.7	142.1
జులై	63.9	24.4	-61.8	63.9	24.4	-61
ఆగస్టు	83.8	13.7	-83.7	83.8	210.8	151.6
సెప్టెంబర్	110.9	14.6	3.3	71.8	34.8	-51.6
	319.6	247.4	-22.6	280.5	417.7	48.9

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గతేడాది అంటే 2023-24 సంవత్సరంలో జూన్ నెలలో సాధారణ వర్షపాతం 60 మిల్లీమీటర్లు అయితే 45.8 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. సాధారణం కంటే 24.9 శాతం తక్కువ వర్షపాతం నమోదయింది. అదే సంవత్సరం ఆగస్టులో 83.8 మిల్లీమీటర్లు అయితే 13.7 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. సాధారణం కంటే 83.7 శాతం తక్కువ పడింది. మొత్తంగా ఆ ఏడాది జూన్ నుంచి సెప్టంబర్ వరకు సాధారణ వర్షపాతం 319.4 మిల్లీమీటర్లు అయితే 247.4 మిల్లీమీటర్లు నమోదయింది. సాధారణం కంటే 22 శాతం తక్కువ పడింది. ఈ ఏడాది అంటే 2024-25 సంవత్సరంలో జూన్‌లో సాధారణం కంటే ఎక్కువ పడింది. జులై నెలలో చూస్తే సాధారణ వర్షపాతం 63.9 మిల్లీమీటర్లు అయితే 24.4మిల్లీమీటర్లు మాత్రమే పడింది. సాధారణం కంటే 61.8 శాతం తక్కువ పడింది. ఇక ఆగస్టులో చూస్తే సాధారణ వర్షపాతం 83.8 మిల్లీమీటర్లు అయితే ఏకంగా 210.8 మిల్లీమీటర్లు పడింది. సాధారణం కంటే 151.6 శాతం అధికంగా పడింది. ఇక సెప్టంబర్‌లో నెలలో సాధారణ వర్షపాతం 71.3 మిల్లీమీటర్లు అయితే కేవలం 34.8 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. సాధారణం కంటే 51.6 శాతం లోటుంది. ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ వరకు చూస్తే సాధారణ వర్షపాతం 280 మిల్లీమీటర్లకుగానూ 417 మిల్లీమీటర్లు నమోదయింది.



ఎండుతున్న వేరుశనగ పంట

గుత్తి మినహా అంతటా వర్షాభావమే

అనంతపురం జిల్లాలో 31 మండలాలుంటే గుత్తి మండలం మినహా తక్కిన అన్ని మండలాల్లోనూ వర్షాభావమే నెలకొంది. గుత్తిలో ఆదివారం రాత్రి ఒక్క రోజే 93 మిల్లీమీటర్లు నమోదయింది. తక్కిన అన్ని మండలాల్లోనూ సాధారణం కంటే సగటున 50 శాతం కంటే తక్కువ వర్షపాతం నమోదయింది.

పంటలపై తీవ్ర ప్రభావం

ఒక నెల ఎక్కువ... ఒక నెల తక్కువ వర్షాల ప్రభావం పంటలపై పడుతోంది. అనంత పురం జిల్లాలో 3,54,183 హెక్టార్ల సాధారణ సాగుభూమి కాగా 2,83,782 హెక్టార్లలో సాగైంది. సాధారణం కంటే 82 శాతం సాగైంది. ప్రధాన పంట వేరుశనగ 1,22,130 హెక్టార్ల సాధారణ సాగుకాగా 96,762 హెక్టార్లలో సాగైంది. వాతావరణ పరిస్థితుల ప్రభావం దిగుబడులపై పడనుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వానలొస్తానే దిగుబడులు

మూడు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాను. సుమారు ఒకటిన్నర లక్ష రూపాయల వరకు పెట్టుబడులు పెట్టాను. వాతావరణ ప్రభావంతో దిగుబడులు ఏమోస్తాయోనన్న దిగులు మొదలైంది. ఆగస్టులో మంచి వర్షాలొస్తే, సెప్టంబర్‌లో చినుకుజాడ లేదు. మరో వారం రోజులు వర్షం లేకపోతే పూర్తిగా నష్టపోయే పరిస్థితి ఉంది.

కొండయ్య, మన్నీల గ్రామం,
అనంతపురం రూరల్.

చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు

◆ జిల్లా వైద్యాధికారిణి మంజువాణి
◆ ఆర్‌కె నర్సింగ్ హోంకు షోకాజ్ నోటీస్

ప్రజాశక్తి-హిందూపురం

వైద్య సేవల్లో చట్టాన్ని ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారిణి మంజువాణి హెచ్చరించారు. పట్టణంలోని పరిగి రోడ్డులో ఉన్న ఆర్‌కె.నర్సింగ్ హోంకు జిల్లా వైద్యాధికారిణి మంజువాణి షోకాజ్ నోటీస్‌ను జారీ చేశారు. బుధవారం ఆమె పట్టణంలో పలు నర్సింగ్ హోంలు, ల్యాబ్‌లను ఆకస్మికంగా తనఖీ చేశారు. ఆర్‌కె నర్సింగ్ హోంలో రికార్డుల నిర్వహణలో లోపాలు ఉండడంతో షోకాజ్ నోటీసు ఇచ్చారు. మళ్లీ తనఖీ చేసే సమయానికి అన్నీ పక్కగా ఉండే విధంగా చూసుకోవాలని హెచ్చరించారు. స్నేహ ల్యాబ్‌ను సందర్శించి ల్యాబ్ మరో చోటుకు మార్చిన సమయంలో అనుమతులు తీసుకోక పోవడంతో వారికి నోటీసు ఇచ్చారు. స్నేహ దయాగ్నస్టిక్స్ ల్యాబ్‌ను సందర్శించి తగు అనుమతులు లేక పోవడంతో మాస్ మీడియా అధికారి బాబా ఫకద్దీన్ ద్వారా ల్యాబ్ నిర్వాహకునికి అక్కడే నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతృ, శిశు మరణాలను నివారించడంలో భాగంగా పిసి పిఎన్‌డిటి చట్టాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. తల్లీబిడ్డలకు అందించే సేవల్లో లోపాలుండకూడదని వైద్యులకు తెలియజేశారు. ల్యాబ్ నిర్వహకులు అందరూ నిర్వహణకు అవసరమైన అన్ని అనుమతులూ తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ల్యాబ్‌లను అక్కడే సీజ్ చేస్తాం అన్నారు. ఆర్ఎంపి వైద్యులు ప్రథమ చికిత్స మాత్రమే నిర్వహించాలన్నారు

విధులలో ఆలసత్వం వహిస్తే ఉపేక్షించను

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించే ప్రశక్తే లేదని జిల్లా వైద్యాధికారిణి మంజువాణి హెచ్చరించారు. పట్టణంలోని శ్రీనివాస నగర్ పట్టణ ఆరోగ్య ఉప కేంద్రంలో పట్టణ ఆరోగ్య ఉప కేంద్రాల వైద్యులతో పాటు పరిశర ప్రాంతాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, తల్లీ బిడ్డలకు అందించే సేవలలో ఎటువంటి నిర్లక్ష్యం చేసినా సహించే ప్రసక్తే లేదన్నారు. అన్ని పారామెటర్స్ వందశాతం పూర్తి చేయాలన్నారు. స్థిరభివద్ధి లక్ష్యాలు, ఎదుగుదల లేని పిల్లల వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఆరోగ్య కార్యకర్తల గహసందర్శన తదితర విషయాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యధికారిణి డా॥పద్మజ, జిల్లా మాస్ మీడియా అధికారి బాబాఫకద్దీన్, వైద్యధికారులు షఫీ సుల్తానా, నవీన్ కుమార్, విజయ్ కుమార్, కిరణ్మయి, మంజుశ్రీ, వైద్య సిబ్బంది ముస్తఫా, రమేష్ పాల్గొన్నారు.

సొసైటీ అక్రమాలపై విచారణ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి డివిజన్ లోని నల్లచెరువు మండలం ఎస్ మొలకల పల్లి, ఎన్‌పి కుంట మండలంలోని సొసైటీలలో చోటు చేసుకున్న అక్రమాలపై అధికారులు విచారణ చేపట్టారు. సెంట్రల్ స్టోర్ నిధులు స్వాహా, కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ అక్రమాలపై బుధవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కదిరి ఆర్డీవో వంశీకృష్ణ విచారణ ప్రారంభించినట్లు సమాచారం. ఈ మేరకు ఆయన బుధవారం కదిరి పట్టణంలోని డివిజనల్ వ్యవసాయ సహకార సంఘ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడినట్లు తెలిసింది. అలాగే సంబంధిత రికార్డులను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లినట్లు సమాచారం .

ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే

ఇంటి నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - మడకశిర

స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు తాను ఇచ్చిన హామీని 24 గంటల్లోపే నెరవేర్చాడు. మండల పరిధిలోని హెచ్‌ఆర్ పాలెం గ్రామంలో బాత్‌రూంలో నివాసమున్న కుటుంబానికి పక్కాగృహం మంజూరు చేస్తామని మంగళవారం హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఇంటి పట్టా ఇచ్చి ఇల్లు నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, హౌసింగ్ డీఈ తో పాటు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఫార్సుల లేఖల పేరుతో ఇబ్బంది పెట్టొద్దు

ప్రజాశక్తి-హిందూపురం



గ్రామ, వార్డు సచివాలయ దివ్యాంగుల ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అశ్వర్థ

సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలుంటేనే కోరుకున్న చోటుకు బదిలీ చేస్తామంటూ ఉన్నతాధికారులు చెప్పడం సరికాదని గ్రామ, వార్డు సచివాలయ దివ్యాంగుల ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అశ్వర్థ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు జరుపుతోందని, అయితే కొంతమంది ఉన్నతాధికారులు రాజకీయ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీల విషయంలో అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ పేరిట అవసరం లేని చోట కూడా ప్రజా ప్రతినిధుల సిఫార్సుల లేఖలతో దివ్యాంగ ఉద్యోగులకు సుదూర ప్రాంతాలకు బదిలీ చేయడం సరికాదన్నారు. మీకు కావాల్సిన చోట పోస్టింగ్‌లు కావాలంటే ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలు తీసుకొని రావాలని ఉన్నతాధికారులు చెప్పడంతో దివ్యాంగ ఉద్యోగులు మానసిక ఆందోళనకు గురి అవుతున్నారని వాపోయారు. మానవతాత్పథం తో దివ్యాంగ ఉద్యోగుల పరిస్థితిని ఆలోచించి సుదూర ప్రాంతాలకు బదిలీ చేయకుండా చూడాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందన్నారు.

'చెకుముకి'తో శాస్త్రీయ దృక్పథం పెంపు

ప్రశ్న పత్రాల ఆవిష్కరణలో ఎంఇఒ గంగప్ప

ప్రజాశక్తి-హిందూపురం

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఏటా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దక్పథం పెంపొందించడానికి దోహదపడుతుందని మండల విద్యాశాఖ అధికారి గంగప్ప తెలిపారు. జెవివి ఆద్వర్యంలో విద్యార్థులకు చెకుముకి టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి గంగప్ప జెవివి నాయకులు, ఉపాధ్యాయులతో ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒలు గంగప్ప, ప్రశన్న లక్ష్మి, జెవివి నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో జనవిజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించి శాస్త్రీయ విజ్ఞానంపై విద్యార్థుల్లో మరింత ఆసక్తిని పెంపొందిస్తున్నట్లు తెలిపారు. జెవివి నాయకులు మాట్లాడుతూ హిందూపురం పట్టణంతో పాటు రూరల్ మండలం, లేపాక్షి, చిలమత్తూరు, పరగి మండలాల్లో 44 పాఠశాలల్లో 3800 మంది విద్యార్థులు చెకుముకి టెస్టుల్లో పాల్గొని పరీక్ష రాశారన్నారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి మండల, జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి ప్రతినిధులు ఓబులేశు, ఎం.రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు సుధామణి, సైన్స్ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, ఇస్తర్ రాణి, ఎంజిఎం పాఠశాల సిద్ధగిరి శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఎంజిఎం పాఠశాలలో చెకుముకి టెస్టు రాస్తున్న విద్యార్థులు

చిన్న, సన్నకారు రైతుల జీవనోపాధి పెంపునకు చర్యలు

కలెక్టర్ టిఎస్. చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

చిన్న సన్న కారు రైతుల జీవనోపాధి పెంచే విధంగా వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ ఆదేశించారు. బుధవారం స్థానిక సాయి ఆరామం అతిథి గహంలో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామంతో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫారం కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రగతి, మార్కెటింగ్ పై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా పెరటి కోళ్ల పెంపకం, వ్యవసాయ ఉత్పత్తులపై మార్కెటింగ్ పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. లాభాపేక్ష లేని గిఫ్ట్ ప్రైవేట్ అంతర్జాతీయ సంస్థ భాగస్వామ్యంతో ట్రాన్స్ ఫారం ప్రాజెక్టు రైతుల ఉత్పత్తులు పెంచే విధంగా కృషి చేయడానికి ముందుకు వచ్చాయన్నారు. డిఆర్‌డిఎ, సెర్ప్ సంస్థలు ట్రాన్స్ ఫారం ప్రాజెక్టు ద్వారా రైతుల జీవనోపాధి పెంచే విధంగా రైతులలో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ రవికాంత్, వ్యవసాయ అధికారి సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, పశుసంవర్ధక శాఖ అధికారి కృష్ణచైతన్య, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ సమావేశం

ప్రజాశక్తి-సోమందేపల్లి

తమ సమస్యల పరిష్కార దిశగా ఆటో కార్మికులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెడబల్లి బాబా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులపై ఆర్టీవో, పోలీసులు వేధింపులు ఆపాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, సిఐటియు మండల నాయకులు రాజగోపాల్, చేనేత కార్మిక సంఘం నాయకులు నారాయణస్వామి, చాంద్‌బాషా, గంగరాజు, బాబు, ఆటో కార్మికులు మారుతి, ఈశ్వర్, జెబి తదితరులు పాల్గొన్నారు.

'మాలగుండ్ల'కు మద్దతుగా సమావేశం

ప్రజాశక్తి-పెనుకొండ



సమావేశంలో పాల్గొన్న వైసిపి నాయకులు

'ఉషశ్రీ వద్దు శంకరన్నే కావాల'ని పెనుకొండ మండల వైసిపి నాయకులు పార్టీ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పెనుకొండ వైసిపి నాయకులు రామ్మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఉమర్ ఫరూక్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి మాల గుండ్ల శంకరనారాయణకు మద్దతుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం కంచుకోటలో వైసిపి జెండా ఎగురవేసిన ఘనత మాల గుండ్ల శంకర్ నారాయణకు దక్కుతుందన్నారు. పార్టీ ప్రారంభం నుంచి ఆయన వైసిపి అభివృద్ధికి కృషి చేశారన్నారు. నాయకులు కార్యకర్తలకు భరోసా కల్పించే శంకరన్నను పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త గా నియమించాలని సమావేశంలో నాయకులు కార్యకర్తలు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ విషయంపై నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లి జగన్మోహన్ రెడ్డికి విన్నవిస్తామని వారు చెప్పారు. ఈ సమావేశంలో పెనుకొండ వైస్ ఎంపీపీ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి - కదిరి టౌన్

క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14,17 బాల బాలికల క్రీడ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలని కోరారు. ఈసందర్భంగా బాల బాలికల తో కలిసి సరదాగా వాలీబాల్ ఆడి ఉత్సాహపరిచారు.



విద్యార్థినులు, ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే కందికుంట

టిడిపి మైనార్టీల పక్షపాతి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మైనార్టీల సంక్షేమం కోసం పాటుపడుతున్నారనిఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో మైనార్టీ విద్యార్థులకు టెట్ పరీక్షకు సంబంధించిన స్టడి మెటీరియల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం మైనార్టీల గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కూటమి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు.

ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తనకల్లు

మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో బుధవారం మండల ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌తో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకులు మురళి స్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులను చాలా చులకనగా చూశారని అన్నారు. ఉపాధ్యాయులను బ్రాందీ షాపుల వద్ద, సినిమా థియేటర్ల వద్ద విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీచేసి ఉపాధ్యాయుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశారని అన్నారు. ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు శివశంకర్, మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన 117 జీవోను రద్దుచేసి తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులను ఎంపిక చేశారు. మండల గౌరవ అధ్యక్షులుగా మురళి స్వామి, మండల అధ్యక్షులుగా శివశంకర్, ప్రధాన కార్యదర్శిగా రామచంద్ర, రోజాను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ లలితమ్మ, కళ్యాణి, హరీంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి వైసిపిలో కోల్డ్‌వార్

ప్రజాశక్తి-సోమందేపల్లి

సోమందేపల్లి మండలంలో వైసిపి నాయకుల మధ్య కోల్డ్‌వార్ తారాస్థాయికి చేరింది. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం స్వగృహంలో మాజీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం ఆధ్వర్యంలో మండలంలోని పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు తదితర వైసీపీ నాయకులు కార్యకర్తలు సమావేశమయ్యారు. వైసిపి పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్తగా శంకరనారాయణను నియమించాలని తీర్మానించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశారు. పెనుకొండ నియోజకవర్గం లో వైసీపీ జెండా ఎగరాలంటే మాలగుండ్ల శంకరనారాయణను సమన్వయకర్తగా ఎంపిక చేయాలని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అయితే ఇదే సమయంలో శంకరనారాయణకు వ్యతిరేకంగా ఉన్న మండలంలోని మరో వర్గం సోషల్‌మీడియా వేదికగా ఎదురుదాడికి దిగింది. శంకర్ నారాయణ వల్లే వైసిపికి ఈ దుస్థితి దాపురించిందని విమర్శించింది. ఆయన వైఖరే ఉషశ్రీ చరణ్ ఓటమికి ప్రథమ కారణమని విమర్శించింది. ఈ నేపథ్యంలో మండలంలోని వైసిపి నాయకుల వైఖరి మండలంలో చర్చగా మారింది.

మెరుగైన వైద్యసేవలందిస్తున్నాం..

ప్రజాశక్తి - బత్తలపల్లి

జిల్లాలో వివిధ రకాల జ్వరాలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని జిల్లా మలేరియా యూనిట్ అధికారి కేసీ కుళ్లాయప్ప. జిల్లా అదనపు మలేరియా యూనిట్ అధికారి ఆర్. లక్ష్మానాయక్ తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం బత్తలపల్లిలోని వినాయక్‌నగర్‌లో పర్యటించారు. జ్వరాలతో బాధపడుతున్న వారిని పరామర్శించారు.కాలనీలో దాదాపు 150 ఇళ్లను సర్వే చేశారు. ఆదేవిధంగా మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను, లార్వా ఉన్న ప్రాంతాలను గుర్తించి విచ్చిన్నం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక పిహెచ్‌సి వైద్యులు గంగిరెడ్డి, సీహెచ్ రాజశేఖర్, ఆరోగ్య సిబ్బంది తిరుపాల్‌నాయక్, మారుతి, ఎఎన్ఎం కవిత, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం

హిందూపురం : పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఫార్మాసి విభాగం ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ ఫార్మసిస్ట్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపల్ హరీష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డ్రగ్ ఇన్స్‌పెక్టర్ హనుమన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఫార్మాసిస్ట్ విశిష్ట సేవలను గుర్తించడానికి. ప్రతి సంవత్సరం సెప్టెంబరు 25న ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. హనుమన్న మాట్లాడుతూ ఫార్మాసిస్టులను ఆరోగ్యప్రదాతులుగా వ్యాఖ్యానించారు ా వ్యాసరచన, వక్తత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో విభాగధిపతులు టీ. శ్రీనివాసులు, ఎం. సుమతి, హరినాధ బాబుతో పాటు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సబ్సిడీతో ఉలవలు పంపిణీ

ప్రజాశక్తి - గుడిబండ

మండల పరిధిలోని సిసిగిరి గ్రామ రైతు సేవా కేంద్రంలో బుధవారం టిడిపి మండల కన్వీనర్ మద్దన కుంటప్ప,జిల్లాఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్ చేతుల మీదుగా రైతులకు 80 శాతం రాయితీతో ప్రభుత్వం అందజేస్తున్న ఉలవలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు, న్యాయవాది శివకుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జి లక్ష్మీ నర్సప్ప, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలో గిరిజన బాలికల పాఠశాలలో బుధవారం అరోమా హెల్త్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో డాక్టర్ బొగ్గు సురేష్ 205 మంది విద్యార్థులకుకంటి పరీక్షలు నిర్వహించారు వీరిలో 40 మంది విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. కంటి సమస్య ఉన్న విద్యార్థులకు అరోమా హెల్త్ సెంటర్‌లో కంటి అద్దాలు అందజేస్తామన్నారు. భవిష్యత్తులో కంటి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు సూచనలు సలహాలు వైద్యులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ్ కుమార్, ఆసుపత్రి సిబ్బంది సుధాకర్, సాయి మోహన్, స్రవంతి, లికిత, ఎఎన్ఎం విజయబాయి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులకు సన్మానం

ప్రజాశక్తి- కొత్తచెరువు

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా ఎంహెచ్ ఇనయతుల్లా, పిసిసి ఉపాధ్యక్షులుగా కోటా సత్యం ఎంపిక కావటం పట్ల ఆపార్టీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారిని కాంగ్రెస్ మండల కన్వీనర్ బెల్లం నజీర్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సనావుల్లా, ఓబులేసు, మోహన్, గౌస్, లక్ష్మీనారాయణ, రెడ్డి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండలం పరిధిలోని నారేపల్లి ప్రాథమిక పాఠశాలలో 50 మంది విద్యార్థులకు కితమత్ ఏ చారిటబుల్ ట్రస్ట్ శామీర్, ఆధ్వర్యంలో పుట్టపర్తి పట్టణానికి చెందిన జూనియర్ ఎన్టీఆర్ అభిమాని బోయపాటి సునీల్ జన్మదినం సందర్భంగా విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు నోటు పుస్తకాలు, పలకలు, రైటింగ్ ప్యాడ్స్, పెన్సిల్ తదితర విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షాకీర్, జావిద్, హెచ్ఎం కిష్టప్ప, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

ప్రజాశక్తి - తనకల్లు

మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పి.మల్లికార్జున. ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సోంపాల్యం నాగభూషణ మాట్లాడుతూ తెలంగాణ రజాకారుల మీద తిరగబడి తన సత్తా చాటిన ధీరవనిత చాకలి ఐలమ్మ జయంతిని మండల కేంద్రంలో జరుపుకోవడం హర్షనీయమన్నారు. ఐలమ్మను ఆదర్శంగా తీసుకొని ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఏకం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షులు మల్లెం అశోక్, మాజీ ఎంపీటీసీ మహబూబ్ బాషా, ఎస్సీ సెల్ చిన్నప్ప, రైతు సంఘం రమణ, పులి మహేష్, ఓబులేసు, బ్యాంకు రెడ్డప్ప, నరేంద్ర, జానకిరామ్, రాముడు, నారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు లోనే పుట్టపర్తి రహదారిలో నాగుల కణం సమీపాన కొండ పోరంపోగు భూమిలో శ్మశాన వాటిక ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఈ మేరకు ఆ స్థలాన్ని తహశీల్దార్ నీలకంఠారెడ్డి బుధవారం పరిశీలించారు. నివేదికను జిల్లా కలెక్టరుకు అందజేయనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ సురేష్, టిడిపి టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు రవి శేఖర్, పిఎస్ వెంగప్ప, ఆర్ నాగేంద్ర, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఖరీఫ్ సీజన్ లో సాగు చేసిన వేరుశనగ పంటలో దిగుబడి అంచనా నిమిత్తం పంటకోత ప్రయోగాలను అధికారులు నిర్వహించారు. బుధవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని సర్వే నెంబర్ 282-1 జె.పురుషోత్తం పొలంలో పంటకోత ప్రయోగాలను ఏవో ఓబిరెడ్డి పర్యవేక్షణలో ఏఎసీ డాక్టర్ కెఎస్ లక్ష్మీనరసింహశర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ఉపేంద్రరెడ్డి, విహెచ్ఎ హసీనా, విఆర్ఎ నరసింహులు, టీడీపీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని కోగిర గ్రామానికి చెందిన వైసిపి యువ నాయకులు కంసల రాజు (30)రెండు రోజుల క్రితం కర్నాటక రాష్ట్రం పావగడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ వాల్మీకి కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పొగాకు రామచంద్ర బుధవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు పాల్గొన్నారు.

పుట్టపర్తి డీటీగా కళ్యాణచక్రవర్తి

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి డిప్యూటీ తహశీల్దార్‌గా బివి.కళ్యాణ చక్రవర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జిల్లా డిఎస్ఓ ఆఫీసులో డీటీగా పని చేస్తూ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - గుడిబండ

మండలంలోని బూదిపల్లిలో నెలకొన్న తాగునీటి సమస్య ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు చొరవతో పరిష్కారం అయింది. గ్రామంలో నెలకొన్న సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటే ఆ గ్రామానికి బోర్వెల్ రిగ్గును పంపి డ్రిల్ చేయించారు. బోరులో పుష్కలంగా నీరు లభ్యం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : మంత్రి సవిత



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి -పరిగి

రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యమనిబీసీ సంక్షేమం చేనేత జౌళి టెక్స్టైల్స్ శాఖ మంత్రి సవితమ్మ పేర్కొన్నారు. బుధవారం పరిగి మండలంలోని బోరెడ్డిపల్లి,విట్టాపల్లి, సిగిపల్లి పంచాయతీలలో రూ. 1.32 కోట్ల వ్యయంతో నిర్మించే రోడ్లు డ్రైనేజీ నిర్మాణాల ప్రారంభ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యమని అన్నారు. రాష్ట్రాన్ని విధాలుగా ఆదుకుంటున్న చంద్రబాబు ప్రభుత్వ పనితీరుకు రాష్ట్ర ప్రజలు జేజేలు కొడుతున్నారన్నారు. వారానికి రెండు రోజులు అధికారులు పొలంలో ఉండాలని పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. గ్రామాల్లో అన్ని సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని వివరించారు. తను ఎమ్మెల్యేగా గెలుపొందడంలో పరిగి మండల ఓటర్ల పాత్ర చాలా కీలకంగా ఉందని వారి రుణం తీర్చుకుని మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. అనంతరం సిగుపల్లిలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రైతు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హసీనాసుల్తానా,ఈవోఆర్డీ శ్రీధర్, విద్యుత్తు డిఇ భూపతి, పిఆర్ డిఇ రమణ, పిఆర్ ఏఈ, స్పెషలా ఆఫీసర్ ప్రసాద్ రావు, మండల నాయకులు గోవింద్ రెడ్డి, సూర్యనారాయణ, బాలాజీ, మారుతి ప్రసాద్, తిలక్, లక్ష్మమ్మ, నాగరాజు, సోమప్ప, శ్రీనివాస్ రెడ్డి, ఈశ్వరప్ప, చంద్రశేఖర్ లక్ష్మణరావు, డిఎస్ఎల్ శ్రీనివాసులు, కంకర శ్రీనివాసులు హనుమయ్య, చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.

యుడిసిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం కోసం వచ్చిన విద్యార్థి కుటుంబాన్ని దూషించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా సహాయ కార్యదర్శి రంగప్ప అధ్యక్షతన బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ సోమందేపల్లి ప్రాథమిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం గ్రామీణ ప్రాంతంతో ముడిపడి ఉందన్నారు. గామీణ ప్రాంతం నుండి వందలాది మంది రోజువారి వ్యవసాయ కూలీలు , రైతులు, పేదలు వైద్యం కోసం వస్తారన్నారు. అయితే ఇక్కడి అధికారి మధు రోగుల పట్ల ప్రవర్తిస్తున్న తీరు సరిగా లేదన్నారు. రోగుల పట్ల దురుసుగా, అహంకార పూరితంగా వ్యవహరించడం క్షమించరాదన్నారు. రోగుల పట్లనే కాకుండా మైన వైఖరి మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, ఆశ వర్కర్ల పట్ల కూడా అనుచితంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఇదే కాకుండా ఆయన వ్యక్తిగత అలవాట్లు కూడా ఆరోగ్య కేంద్రంలో ఇబ్బంది కలిగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేసి యుడిసి మధుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల వైద్యాధికారులు హరి కుమార్ , ఓంకార్‌కు అందజేశారు, ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నార్పింపల్లి ఆంజనేయులు , భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజక వర్గం కన్వీనర్ కొండా వెంకటేశులు , జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణం , రవి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య , చేనేత కార్మిక సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, వార్డు మెంబర్ వెంకటేశ్వర్లు , కుమ్మర కిష్టప్ప , కల్లు గీత కార్మిక సంఘం రామకృష్ణ , ఈడిగ నాగరాజుతో పాటు స్థానికులు వలి , మధు , నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్



ధర్నాలో పాల్గొన్న నాయకులు

ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటా సత్యం ఆధ్వర్యంలో ఈ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట సత్యం మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీలు ఇచ్చారన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి అయినప్పటికీ అసలైన పథకాలను అమలు చేయలేదన్నారు. వెంటనే అమలు చేయాలని ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఇనయతుల్లా, పార్టీ నాయకులు గౌస్ బాష, నజీర్, లక్ష్మీనారాయణ, కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు చేనేత సంఘాల ధర్నా

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మండల పరిధిలోని వేల్పుమడుగు క్రాస్ వద్ద వున్న జే ఆర్ సిల్క్స్ కర్మాగారం వద్ద ఎపి చేనేతకార్మిక పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ ధర్నాకు చేనేతకార్మికులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈసందర్భంగా గీతానగర్ లో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణి చేశారు, ఈ కార్యక్రమంలో చేనేత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లల మర్రి నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షులు మాధవస్వామి, సత్యసాయి జిల్లా కార్యదర్సులు వెంకటనారాయణ ఎస్‌హెచ్. బాషా, జివి రమణ, మోహన్ మాట్లాడుతూ చేనేత పరిశ్రమను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఈ ధర్నా లో ప్రతీ యొక్క చేనేత కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు వెంకటస్వామి, ఆదినారాయణ, రవికుమార్, రమణ, వి వెంకటస్వామి, ఖాదర్ బాషా, శ్రీధర్, శ్రీనివాసులు, కొండాతో పాటు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కృషి : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

నేరాల నియంత్రణకు పోలీసులు అధికారులు తగిన చర్యలు తీసుకుని పోలీస్ శాఖ పట్ల ప్రజల్లో విశ్వాసనీయత పెంచాలని ఎస్పీ వి.రత్న పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో కదిరి, పుట్టపర్తి సబ్ డివిజన్ పోలీస్ అధికారులకు నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ, ఫోక్సో, గంజాయి మర్డర్, చోరీలు ఎన్ డి పి ఎస్, గ్యాంబ్లింగ్ ,రోడ్డు ప్రమాదాలు పెండింగ్ కేసుల గురించి ఎస్పీ సమీక్షించారు. గ్రామ సందర్శనలు పల్లె నిద్ర కార్యక్రమాలు చేపట్టాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలలన్నారు. మహిళా పోలీసులతో వారానికి ఒకసారి పోలీస్ అధికారులు సమావేశాలు నిర్వహించాలన్నారు. చేదింపుల కేసులలో ప్రతిభ కనబరిచిన 20మంది సిఐ, ఎస్ఐ , పోలీసులు, పోలీస్ సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.ఈ సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు పుట్టపర్తి కదిరి డీఎస్పీలు ఆవుల శ్రీనివాసరావు, శివ నారాయణ స్వామి, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి,సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ

కార్మికుల సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్




వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కదిరి వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు జగన్మోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కదిరి పట్టణంలోని వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న నాలుగు నెలల వేతనం చెల్లించాలని, కార్మికులకు సంబంధించి పిఎఫ్ ఖాతా వివరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాదాపు 15 సంవత్సరాలకు పైగా ఈ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు రోజు మార్చి రోజు పని పెట్టే పద్ధతి ఆపాలని వీరందరిని టైం స్కేల్ ఉద్యోగులుగా గుర్తించి ఉపాధి భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామ్మోహన్, ముస్తాక్, ఫాజిల్, బాబ్జన్ తదితరులు పాల్గొన్నారు.

కేతిరెడ్డిని పరామర్శించిన వైసిపి జిల్లా అధ్యక్షులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీ చరణ్, మడకశిర వైసిపి ఇన్‌ఛార్జి ఈరలక్కప్ప బుధవారం పరామర్శించారు. సోమవారం జరిగిన ఘర్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ ధర్మవరంలో కేతిరెడ్డి మీద, వైసిపి నాయకులు, కార్యకర్తలపై కూటమి నాయకులు దాడులు చేయడం అమానుషమన్నారు. భవిష్యత్తులో తమ కార్యకర్తలు జోలికి ఎవరు వచ్చినాఉపేక్షించమని చట్ట పరంగా ముందుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వై సి పి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ధర్మవరం నాయకులతో మాజీమంత్రి, తదితరులు

పట్టుగూళ్ల మార్కెట్ అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో ఉన్నా పట్టు గూళ్ల మార్కెట్ అభివృద్ధికి ఎమ్మెల్యే బాలయ్య సహకారంతో చర్యలు తీసుకుంటామనిటిడిపి నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పట్టు గూళ్ల మార్కెట్‌లో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసరావుతో పాటు టిడిపి నాయకులు పట్టు రీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టు రీలర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాస రావు మాట్లాడుతు పట్టుగూళ్ల మార్కెట్ భవనం శిథిలావస్థకు చేరుకుందని, భవన నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.. త్వరలో వ్యవసాయ శాఖ మంత్రితో చర్చించి ఇప్పటి వరకు రీలర్లతో పాటు రైతులకు రావాల్సి ఇన్సెంటీవ్ లను విడుదల అయ్యే విధంగా చూస్తామన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ అధికారి లక్ష్మీ రెడ్డి, పట్టణ అధ్యక్షులు డిఇ రమేష్ కుమార్, నాయకులు అమర్నాథ్, బేవనహళ్లి ఆనంద్, డైమండ్ బాబా, దుర్గా నవీన్, మొద శివ కుమార్, కురువ మల్లికార్జున, రాజశేఖర్, అశోక్, అన్వర్, బాబు, అబూబకర్, బాబు రెడ్డి, బుడ్డన్న, సమీవుల్లా, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

జిల్లా స్థాయి పోటీలకు 'టీచ్' స్కూల్ విద్యార్థి

ప్రజాశక్తి - రొద్దం

కొడిగేనాహళ్లి ఎపిఆర్ఎస్ పాఠశాల మైదానంలో నిర్వహించిన డివిజినల్ క్రీడా పోటీల్లో శ్రీ టీచ్ఐ స్కూల్ విద్యార్థి జగన్ మోహన్ ప్రతిభ కనపర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అండర్ 17 విభాగంలోని 400మీటర్లు పరుగు పోటీలో పాల్గొన్న జగన్‌మోహన్ ప్రతిభ కనపర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిమ్మారెడ్డి తెలిపారు.



విద్యార్థి జగన్‌మోహన్

నాలుగో సెమిస్టర్ డిగ్రీ ఫలితాల్లో ఎన్ఎస్‌పిఆర్ విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం మంగళవారం విడుదల చేసిన నాలుగవ సెమిస్టర్ డిగ్రీ పరీక్ష ఫలితాలలో ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనపర్చినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి తెలిపారు. బీఎస్సీలో 82 శాతం, బిఏ లో 96 శాతం, బీకాం లో 80శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఉర్దూ, జువాలజీ, మాథ్స్ సబ్జెక్టులలో వంద శాతం ఉత్తీర్ణతను సాధించడం విశేషం అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ విద్యార్థినులను, వారి ఉత్తీర్ణతకు కారకులైన అధ్యాపకులకు అభినందించారు.

నేరాలు ఘోరాలు

ధర్మవరం ఘటనలో కేసులు నమోదు : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ధర్మవరం ఘటనలో ఇరు వర్గాలపై కేసులను నమోదు చేశామని ఎస్పీ వి, రత్న పేర్కొన్నారు.ధర్మవరం పట్టణంలో రెండు రోజుల క్రితం ఇరు పార్టీల మధ్య చోటు చేసుకున్న సంఘటనలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ఇరువురుపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. పట్టణంలో ఇటువంటి సంఘటనలు జరగకుండా పోలీసుల పరంగా అన్ని చర్యలు చేపట్టామన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ చట్టం ప్రకారమే వెళ్తామని, చట్టం దృష్టిలో అందరూ సమానమే అని అన్నారు. ప్రజాప్రతినిధులు సమయస్ఫూర్తితో వ్యవహరించాలని ఎస్పీ సూచించారు.

విద్యుత్‌షాక్‌తో గొర్రెలు మృతి

ప్రజాశక్తి - తలుపుల

గొర్రెల కోసం వేసిన రేకుల షెడ్‌కు విద్యుత్ సరఫరా కావటంతో షాక్‌కు గురై 13 గొర్రెలు మృతిచెందాయి. మండలంలోని వేపమానిపేట పంచాయతీ గంజివారిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన గంగన్న తనకున్న 13 గొర్రెలను రోజువారి మేత మేపుకొని వచ్చి ఇంటి ఆవరణంలోని రేకులషెడ్‌లో వదిలాడు. ఆ షెడ్‌కు విద్యుత్‌వైరు తగిలి విద్యుత్ సరఫరా అయింది. ఆ సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో తనకు సుమారు 2 లక్షల రూపాయల దాకా నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు గంగన్న కోరారు.

విలేకరిపై దాడి - ఎస్పీకి ఫిర్యాదు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ధర్మవరం పట్టణంలో ఓ ప్రతికా విలేఖరిపై జరిగిన దాడి ఘటనపై శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీకి పుట్టపర్తి పాత్రికేయుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజే శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు పుల్లయ్య ఆధ్వర్యంలో బుధవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి. రత్నకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు జిల్లాలో పాత్రికేయులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విలేకరిపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేశామని, దాడికి పాల్పడిన సంఘటనను పరిశీలించామని ఇరు పక్షాలపై కేసు నమోదు చేశామని తెలిపారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - తనకల్లు

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మునెమ్మ (48)అనే మహిళ అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న కదిరి ఎమ్మెల్యే కంది కుంట వెంకటప్రసాద్ మృతురాలి అంత్యక్రియలకు పదివేల రూపాయల ఆర్థికసాయాన్నిజనసేన ఎంపీటీసీ అమర్ కార్తికేయ ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, హర్షద్, భరత్ కుమార్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ : తనకల్లు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మృతిచెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త క్రిష్టప్ప కుటుంబీకులను కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కంది కుంట వెంకటప్రసాద్ బుధవారం పరామర్శించారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించి 50వేల రూపాయల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపిమండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, మాజీ కన్వీనర్ శంకర్ నాయుడు, మాజీ ఎంపీటీసీ మహబూబ్ బాషా చిన్నప్ప, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విలేకరిపై దౌర్జన్యం

ప్రజాశక్తి - మడకశిర

పట్టణంలోని అమరాపురం రోడ్డులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాన్ని తనిఖీ చేయడానికి వచ్చిన ఓ అధికారి స్థానిక విలేకరిపై దౌర్జన్యం చేశాడు. ఈ మేరకు ఆ అధికారి బుధవారం ప్రభుత్వ మద్యం దుకాణాన్ని తనిఖీ చేశాడు. ఆ వివరాలను కనుక్కోవడానికి వెళ్లిన విలేకరిపై ఆ అధికారి తన జులుం ప్రదర్శించాడు. ఈ తతంగం చూస్తున్న స్థానికులు ఆ అధికారి వైఖరిపై ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఇదిలా ఉండగా అదే సమయంలో అక్కడే ఉన్న ఓ మండల విద్యాధికారి, ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కూడా విలేకరిపై దుర్భాషలాడారు.

ధర్మవరం సబ్ రిజిస్ట్రార్‌గా తాయన్న

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం సబ్ రిజిస్ట్రార్‌గా తాయన్న బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రమణారావు బదిలీ కాగా ఆయన స్థానంలోకణేకల్ సబ్ రిజిస్టార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తాయన్న ధర్మవరం సబ్‌రిజిస్టార్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్టర్ కార్యాలయ సిబ్బంది బదిలీ అయిన రమణా రావును సన్మానించి వీడ్కోలు పలికారు. నూతన సబ్ రిజిస్టార్‌కు స్వాగతం పలికారు.

పుట్టపర్తిలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైం

పుట్టపర్తి సబ్ డివిజన్లో మొట్టమొదటి స్మార్ట్ మీటర్‌ను హనుమాన్ సర్కిల్ లో సీసీ కెమెరాలకు అమర్చి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని విద్యుత్ ఏఈ నారాయణమ్మ, మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్మార్ట్ మీటర్స్ జేఈ అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈ స్మార్ట్ మీటర్లను మూడు దశలలో పట్టణంలో ప్రారంభిస్తామన్నారు. పట్టణంలోని హనుమాన్ టెంపుల్ వద్ద ఉన్న సీసీ కెమెరాలకు ఈ స్మార్ట్ మీటర్ అమర్చడం జరిగిందన్నారు. మొదటి దశలో ప్రభుత్వ కార్యాలయాలకు, రెండవ దశలో క్యాటగిరి 2 లో ఉన్న గృహాలకు, మూడవ దశలో సాధారణ గృహాలకు అమర్చుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ శివయ్య, లైన్ ఇన్స్‌పెక్టర్లు రాంబోజి నాయక్, భాష, లైన్మెన్లు గోపాల్ నాయక్, శ్రీరామ్ నాయక్, రామాంజనేయులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగభృతికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

వేదవిద్యను అభ్యసించిన నిరుద్యోగ వేద పండితులు నిరుద్యోగభృతి కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా దేవాదాయ శాఖ అధికారి నరసింహ రాజు కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన నిరుద్యోగ వేద పండితులకు నెలకు 3వేల రూపాయల భృతి ఇవ్వడానికి ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించిందన్నారు. అర్హులైన వేద విద్యార్థులు తమ సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్‌తోపాటు తాను ఎలాంటి ఉద్యోగం చేయలేదని స్వీయ ధ్రువపత్రంతో జిల్లా దేవాదాయ అధికారి కార్యాలయంలో ఈనెల 26లోగా సమర్పించాలని ఆయన కోరారు.

ఆలయంలో వసతుల ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - అమరాపురం

మండలంలోని ప్రసిద్ధి గాంచిన హేమవతి హేంజెరు సిద్దేశ్వర దేవాలయానికి వచ్చే భక్తులకు వసతులు కల్పించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. స్నానపు గదులు నిర్మాణం కోసం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ మల్లికార్జున్, డీఈ మను నాయక్, ఏ ఈ హరి స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమ లో తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షులు జయకుమార్ నాయకులు రామచంద్ర యాదవ్, ఓంకార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

డివైఇఒకు హిందీ సేవా పురస్కారం

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ ఉపవిద్యాశాఖాధికారి టి.రంగస్వామికి హిందీ సేవా పురస్కారం అందజేశారు. ఈ మేరకు శ్రీ సత్యసాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్‌భాషా రంగస్వామిని సేవా పురస్కారంతో సత్కరించారు. ఈ నెల 20వ తేదీన హిందీ దివస్ కార్యక్రమం నిర్వహించారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందీ ఉపాధ్యాయులు తరపున డివైఇఒను హిందీ భాషా సేవ పురస్కారంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ జహీరుద్దీన్.రవీంద్ర గురువర ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సెమీఫైనల్‌కు చేరిన సీనియర్ మహిళా జట్టు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్య సాయి జిల్లా సీనియర్ మహిళా ఫుట్‌బాల్‌జట్టు రాష్ట్రా స్థాయి పోటీలలో ప్రతిభ కనబర్చి సెమిఫైనల్స్ కు చేరినట్లు అనీల్ కుమార్ తెలిపారు. విజయవాడలో బుధవారం జరిగిన మ్యాచ్ లో జిల్లా క్రీడాకారులు మంచి ప్రతిభ కనబర్చి సెమీఫైనల్‌కు చేరారన్నారు. గురువారం ఉదయం కర్నూల్ జట్టుతో తలపడనున్నట్లు తెలిపారు. జట్టుకు కోచ్ లుగా మహమ్మద్ సలీమ్, దుర్గాప్రసాద్ వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.